క్లుప్తంగా

సందడిగా భగినీహస్త భోజన వేడుక



అంగరలో సోదరుల చేతుల మీదుగా కానుక పొందుతున్న సోదరి

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం భగినీహస్త భోజన వేడుకను ఘనంగా జరుపుకున్నారు. అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, కపిలేశ్వరపురం, వల్లూరు, కోరుమిల్లి తదితర గ్రామాల్లోని సోదరి ఇంటికి సోదరులు రాగా ప్రేమ ఆప్యాయతలతో ఆతిథ్యం లభించింది. సోదరి చేతులతో భోజన ఆతిథ్యం పొందిన సోదరులు కానుకలు అందజేశారు. పెద్ద వయస్సు వారి నుంచి చిన్నారులు వరకూ సరదాగా గడిపారు. ఆదివారం సెలవు దినం కావడంతో రోజు వారీ పనులను పక్కన పెట్టి కుటుంబ సభ్యులతో సందడి చేశారు. పడమర ఖండ్రికలోని ఉయ్యాల జంపాల దైవ క్షేత్రంలో కొత్తపేట మండలం మందపల్లికి చెందిన గోకవరపు పేరయ్య, మహాలక్ష్మిలకు చెందిన కుటుంబ సభ్యులు సుమారు 30 మంది ఈ వేడుక జరుపుకున్నారు.

నేడు తాతపూడిలో రీ సర్వే గ్రామసభ

కపిలేశ్వరపురం: భూసర్వే ప్రక్రియలో భాగంగా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని తాతపూడి గ్రామంలో సోమవారం గ్రామసభ నిర్వహించనున్నట్టు తహసీల్దార్ చిన్నారావు తెలిపారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ అనుబంధ శాఖల అధికారుల పర్యవేక్షణలో నిర్వహించే గ్రామసభలో భూ సమస్యలు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, జాయింట్ ఎల్‌పీఎంలు, ఖాతా నంబరు తప్పులు, మ్యుటేషన్ల సమస్యలపై దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. 5న మాచరలో నిర్వహించనున్న గ్రామసభతో మండలంలో గ్రామసభల షెడ్యూల్ ముగియనుందని తహసీల్దార్ తెలిపారు.

కుంగిపోతున్న ఏటిగట్టు దారి



కుమ్మరిసావరం వద్ద కిందకు దిగిపోయిన రోడ్డు

కె.గంగవరం: కోటిపల్లి కుమ్మరిసావరం వద్ద ఏటిగట్టు రహదారి కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిలో వాహనాలు వచ్చేటప్పుడు దిగిపోయిన రోడ్డును గమనించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పెద్ద వాహనాలు వెళ్లేటప్పుడు మరింత అప్రమత్తత లేకుంటే ఇబ్బందే. అధికారులు వెంటనే స్పందించి రోడ్డును బాగు చేయించాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఈశ్వరా... సర్వేశ్వరా

- అష్టసోమేశ్వరాలయాలు.. భక్తుల పాలిట వరాలు
- నేడు కార్తిక సోమవారం



దంగేరులో ఉమా సోమేశ్వరస్వామివారి ఆలయం



ద్రాక్షారామలో భీమేశ్వరస్వామి



వెంటూరులో పార్వతీ సమేత ఉమాసోమేశ్వరస్వామి



సోమేశ్వరంలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి



కోటిపల్లి శ్రీఛాయా సోమేశ్వరస్వామి

రామచంద్రపురం: కార్తికం ఈశ్వరునికి ఎంతో ప్రీతికరమైన మాసం.. ఈ రోజుల్లో భక్తిశ్రద్ధలతో స్వామిని కొలిస్తే ఈశ్వరానుగ్రహం కలుగుతుందని భక్తుల విశ్వాసం.. ఆ స్వామి అనుగ్రహం పొందేందుకు ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా అష్ట సోమేశ్వరాలయాల్లో ఈశ్వరుడు కొలువుదీరిన అరుదైన కోవెలలున్నాయి. అష్టసోమేశ్వర ఆలయాలను దర్శించుకుంటే భగవత్ అనుగ్రహం కలుగుతుందని పండితులు చెబుతున్నారు. రామచంద్రపురం, మండపేట పరిసర గ్రామాల్లోని అష్ట సోమేశ్వరాలయాలకు ప్రత్యేక స్థానం ఉంది. ద్రాక్షారామలోని శ్రీమాణిక్యాంబ సమేత భీమేశ్వరాలయం దక్షిణ కాశిగా విరాజిల్లుతోంది. సూర్యునిచే స్వయం ప్రతిష్ఠగా ప్రసిద్ధికెక్కిన ద్రాక్షారామ భీమేశ్వరుడు అష్ట సోమేశ్వరాలయాల నడుమ కొలువుదీరి ఉన్నాడు. అనుకోని అవాంతరం కారణంగా కాలహరణమైన ముహూర్త సమయం మించిపోతుండటంతో భీమేశ్వరుడు స్వయంభు లింగంగా ద్రాక్షారామలో అవతరించాడు. భీమలింగాన్ని సూర్యభగవానుడు ప్రతిష్ఠించి భీమేశ్వరునికి ప్రథమార్చన గావించినట్లు పురాణ ప్రతీతి. చంద్రునితో స్వయం ప్రతిష్ఠితాలుగా ద్రాక్షారామ భీమేశ్వరాలయం అష్ట దిక్కుల్లో సోమేశ్వరాలయాలు ప్రతిష్ఠింపబడినట్లు పురాణ గాథలు చెబుతున్నాయి. ద్రాక్షారామ భీమేశ్వరునికి ఒక్కో యోజన దూరంలో అష్ట సోమేశ్వరాలయాలు ఉండటం విశేషం. కార్తికంలో వాటిని దర్శించుకోవటం భక్తులు ఎంతో పవిత్రంగా భావిస్తారు.

తూర్పున కోలంక

ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి తూర్పున కాజులూరు మండలం కోలంక గ్రామంలో పార్వతీ సమేత ఉమా సోమేశ్వరస్వామి ఉన్నారు. కార్తిక మాసంలో ఈ స్వామివారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని ప్రసిద్ధి. కాజులూరు మండలం కోలంకకు చేరుకోవాలంటే ద్రాక్షారామ నుంచి యానాం వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కాలి. ఆటో సదుపాయం కూడా ఉంది.

పడమర వెంటూరు

ద్రాక్షారామకు పడమర దిక్కులో రాయవరం మండలం వెంటూరులో పార్వతీ సమేత ఉమాసోమేశ్వర స్వామి ఆలయం ఉంది. వెంటూరు చేరుకోవాలంటే రామచంద్రపురం- వాకతిప్ప ఆర్టీసీ బస్సులో వెళ్లొచ్చు. రామచంద్రపురం నుంచి నేరుగా ఆటో సదుపాయం ఉంది.

దక్షిణాన కోటిపల్లి

అష్ట సోమేశ్వరాలయల్లో గౌతమీ నదీ తీరాన కె.గంగవరం మండలం కోటిపల్లి శ్రీచాయా సోమేశ్వరాలయం ప్రసిద్ధికెక్కింది. చంద్రునిచే స్వయం ప్రతిష్ఠగా వెలసిన సోమేశ్వరుడిని పవిత్ర గోదావరి పుణ్యస్నానమాచరించి దర్శించుకుంటే పాపపరిహారం లభిస్తుందని భక్తుల నమ్మకం. ద్రాక్షారామ నుంచి నేరుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది.

ఉత్తరాన వెల్ల

ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారికి ఉత్తరాన రామచంద్రపురం మండలం వెల్లలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామివారి ఆలయం భక్తులకు కోర్కెలు తీర్చే కొంగుబంగారం. రామచంద్రపురం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో వెల్ల చేరుకోవటానికి ఆటో సదుపాయం ఉంది.

ఆగ్నేయంలో దంగేరు

ద్రాక్షారామకు ఆగ్నేయంగా ఉన్న కె.గంగవరం మండలం దంగేరులో కొలువైన ఉమా సోమేశ్వరాలయం అతి ప్రాచీన ఆలయంగా ప్రసిద్ధికెక్కింది. కార్తిక మాసంలో భక్తులు స్వామివారిని దర్శించుకుంటే ఎంతో మేలని చెబుతుంటారు. ద్రాక్షారామ నుంచి మసకపల్లి ఆర్టీసీ బస్సుతో పాటు ఆటో సౌకర్యం కూడా ఉంది.

నైరుతిలో కోరుమిల్లి

ద్రాక్షారామకు నైరుతిలో కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లిలో కొలువైయున్న రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వరాలయం అష్ట సోమేశ్వరాలయాల్లో ఒకటిగా వెలుగొందుతుంది. ద్రాక్షారామ, రామచంద్రపురం, మండపేటల నుంచి నేరుగా ఆర్టీసీ బస్సులతో పాటు ఆటోల సదుపాయం కూడా కలదు.

వాయువ్యంలో సోమేశ్వరం

ద్రాక్షారామ ఆలయానికి వాయువ్యంలో రాయవరం మండలం సోమేశ్వరంలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామివారి ఆలయం ఉంది. ఇక్కడకు అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. రామచంద్రపురం నుంచి మాచవరం మీదుగా ఆర్టీసీ బస్సులో సోమేశ్వరం చేరుకోవచ్చు.

ఈశాన్యంలో పెనుమళ్ల

ద్రాక్షారామకు ఈశాన్యంలో కాజులూరు మండలం పెనుమళ్ల గ్రామంలో పార్వతీ సమేత సోమేశ్వర స్వామి కొలువై ఉన్నారు. కార్తిక మాసంలో స్వామివారి ఆలయం వద్ద భక్తులు దర్శనం చేసుకుంటారు. ద్రాక్షారామతో పాటు గొల్లపాలెం నుంచి ఆటోల్లో పెనుమళ్ల చేరుకోవచ్చు.

మంచు కురిసే వేళలో..



కె.గంగవరంలో ఉదయం 6 గంటలకు పొగ మంచు

కె.గంగవరం: చలికాలం ప్రారంభమైంది. రాత్రి నుంచి ఉదయం 8 గంటల వరకూ గ్రామీణ ప్రాంతాలను మంచు దుప్పటి కప్పేస్తోంది. కె.గంగవరంలో శనివారం ఉదయం మంచు 8 గంటల వరకూ మంచు వదలలేదు. ఉదయాన్నే పొలం పనులకు వెళ్లే రైతులు, కూలీలు మంచుతో అల్లాడారు. రోడ్లపై వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

దంత వైద్యులను నియమించాలి

కాజులూరు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రభుత్వం దంత వైద్యులను నియమించాలని డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రజలకు దంత సమస్యలు అధికమయ్యాయన్నారు. పీహెచ్‌సీల్లో వైద్యులు లేక రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి జేబులను గుల్ల చేసుకుంటున్నారన్నారు. గొల్లపాలెం, దుగ్గుదుర్రు పీహెచ్‌సీల్లో ఏదోక చోటైనా దంత వైద్యులను నియమించి రోగులకు సేవలందించాలన్నారు.

లారీ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఏర్పాటు

మండపేట: శ్రీ సాయి రైస్‌మిల్లర్స్ లారీ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఆదివారం స్థానిక బైపాస్ రోడ్డులో ఏర్పాటైంది. అధ్యక్షుడిగా షేక్ కాలేషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా జి.చంద్రరావు, కార్యదర్శిగా చొల్లంగి రాజశేఖర్, సంయుక్త కార్యదర్శిగా సీతిని రామకృష్ణ, కోశాధికారిగా కంజు సత్యనారాయణలను సభ్యులు ఎన్నుకున్నారు. అలాగే ఆర్గనైజర్లుగా నీలా శ్రీరామ్ ప్రసాద్, వనుం నాగబాబు, దాసరి చంద్రరావు, సూరంపూడి రామకృష్ణ నియమితులయ్యారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై వర్కర్స్ సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వారిని లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కాయల రమేష్, కాకినాడ లారీ ఓనర్స్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ అభినందించారు.

ఉత్తమ సేవలు అభినందనీయం



తపాలా ఉద్యోగి జానకి దంపతులను సత్కరిస్తున్న శ్రీనివాస్, తపాలా ఉద్యోగులు

రామచంద్రపురం: ఉద్యోగ బాధ్యతల్లో ఉత్తమ సేవలు అందించిన కె.జానకి అభినందనీయులని రాజమహేంద్రవరం డివిజనల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్ సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. తపాలా శాఖలో 33 ఏళ్ల పోస్ట్‌మాస్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన జానకిని రామచంద్రపురం ప్రధాన తపాలా కార్యాలయం పోస్టల్ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాన తపాలా కార్యాలయం వద్ద సత్కరించారు. హెడ్ పోస్టుమాస్టర్ శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఏఎస్‌పీ సీహెచ్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. మండపేట, కొత్తపేట హెడ్ పోస్ట్‌మాస్టర్లు ఎంవీ సుబ్బారెడ్డి, కె.విఠల్‌నాథ్ మాట్లాడుతూ జానకి సేవలను కొనియాడారు. రాష్ట్ర ఎస్‌బీసీఓ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పి.భవాని వీరకుమార్, కొండపల్లి సూర్యనారాయణ, తపాలా ఉద్యోగుల డివిజనల్ కార్యదర్శి బి.కొండబాబు, జీవీ రమణమూర్తి, కె.ఈశ్వరరావు, ఎస్వీ రామలింగేశ్వరరావు, ఎల్.నాగేంద్రబాబు, సలాది సత్యనారాయణ మూర్తి, టి.పుల్లేశ్వరరావు, బి.సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ సభకు ముస్లిం మైనారిటీలు




విజయవాడకు బస్సులో బయలుదేరిన ముస్లింలు

మండపేట: వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ కోసం విజయవాడలో ఆదివారం నిర్వహించిన మహాసభలో పాల్గొనేందుకు మండపేట నుంచి ముస్లింలు, నూర్‌బాషాలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. మహాసభ విజయవంతానికి ×వక్ఫ్ పరిరక్షణ తమ బాధ్యత । అనే నినాదంలో విజయవాడ తరలి వెళ్లినట్టు ముస్లిం మైనారిటీ నాయకుల ఎండీ అతావుర్ రెహ్మాన్ (అల్తాఫ్), ఫారుఖ్ అలీ, హర్షి, మౌలాలీ, మహమ్మద్ కరీముల్లాషా ఖాదరీ (కరీం)లు తెలిపారు. ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసుకుని వెళ్లామన్నారు.

పైడా జమీందారును ఆహ్వానించకపోవడం సరికాదు

రామచంద్రపురం రూరల్: ప్రసిద్ధి చెందిన ద్రాక్షారామ ప్రసన్నాంజనేయ స్వామి కార్తిక దీపారాధన మహోత్సవాలకు పైడా జమీందారును ఆహ్వానించకపోవడం సమంజసం కాదని ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం వ్యవస్థాపకుడు ఏలూరి ప్రసాదరావు అన్నారు. 1963లో చిన్న పిల్లలుగా ఉన్న తమ బృందం చేసిన విజ్ఞప్తికి జమీందారు పైడా రామకృష్ణయ్య సానుకూలంగా స్పందించకపోయి ఉంటే ఈ కార్తిక దీపారాధన మహోత్సవం ప్రారంభించి ఉండేవాళ్లం కాదన్నారు. అప్పట్లో ఊరు మొత్తానికి భీమేశ్వరాలయ ప్రాంగణంలోని పైడా అన్న సత్రం వద్దనే కరెంటు ఉండేదన్నారు. ఆ కరెంటు ఉపయోగించుకోవాలని ఆయనను అనుమతి కోరితే మొత్తం అన్నసత్రం ఉపయోగించుకునేలా అవకాశం కల్పించారన్నారు. ఆయన తరువాత ఆయన కుమారుడు పైడా సత్యప్రసాద్ కూడా కార్తిక దీపారాధన మహోత్సవానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నారని అన్నారు. పూర్తిగా అన్నసత్నం ఉపయోగించుకోవడమే కాకుండా ఏర్పాట్లలో సహకరించే అందరికీ భోజన సదుపాయం కూడా ఆయనే కల్పిస్తూ ఉంటారన్నారు. ఏటా జరిగే రాట ముహూర్తం నిత్యాన్నదాత, కార్తిక దీపారాధన మహోత్సవానికి పూర్తిగా సహకరిస్తున్న ఆయన చేతుల మీదుగా నిర్వహించడం ఆనవాయితీగా నిర్వహిస్తూ వచ్చారన్నారు. అటువంటిది ఈ ఏడాది కారణాలు ఏవైనా ఆనవాయితీని కాదని ఆయనను పిలవకుండదని కొందరు అడ్డుపడటం, దానికి ప్రస్తుత కమిటీ తలవొగ్గడం చాలా బాధగా ఉందన్నారు.



ఏలూరి ప్రసాదరావు, బాలభక్త సమాజం వ్యవస్థాపకుడు, ద్రాక్షారామ

కపిలేశ్వరపురం మండల కార్యదర్శులు

కపిలేశ్వరపురం–1	కె.శివచక్రవర్తి	9948970046
కపిలేశ్వరపురం–2	కె.పండు	9441818405
తాతపూడి	బ్రహ్మాజీరావు	9381725156
అంగర–1	ఆర్ఎంవీవీఎస్ ఈశ్వరరావు	9618861999
అంగర–2	మహమ్మద్ అలీ షేక్	9652244131
పడమర ఖండ్రిక	పి.సత్తిబాబు	9676273393
వెదురుమూడి	వై. శారద	8790515028
వల్లూరు	కె.సత్తిబాబు	9959545391
నేలటూరు	పి.మోహన్	8008707882
నిడసనమెట్ట	జి.విజయ్‌కుమార్	9550096513
వడ్లమూరు	పి.వెంకటేశులు	8919435971
నల్లూరు	పి.రమేష్	9618988149
కాలేరు	యు.సుప్రియ	7981281398
అచ్యుతాపురం	జి.దేవీప్రసన్న	550124927
టేకి	కె.రామకృష్ణ	9951480999
టేకి	ఎస్.శ్రీనివాసు	8978306474
కేదారిలంక	కె.యశ్వంత్‌కుమార్	7780276777
మాచర	జి.చినబాబు	99853 84544
కోరుమిల్లి–1	ఆర్ఎస్‌వీ కామేశ్వరరావు	908852108
కోరుమిల్లి–2	కె.శంకరమూర్తి	9502121667
నాగులచెరువు	కె.యశ్వంత్‌కుమార్	7780276777
వాకతిప్ప	పి.వెంకటేశులు	8919435971
అద్దంకివారిలంక	జి.చినబాబు	9985384544

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

కాజులూరు: త్వరలో జరగనున్న ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టభద్రులంతా తప్పని సరిగా ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎల్.శివకుమార్ అన్నారు. ఆదివారం కాజులూరులో ఆయన మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీతో ఓటరు నమోదుకు గడువు ముగుస్తుందన్నారు. 31 అక్టోబర్ 2021 తేదీ నాటికి డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులంతా ఓటు నమోదుకు అర్హులన్నారు. మండల గ్రామాల్లోని వివిధ శాఖల అధికారులు, పలు పార్టీల నాయకులు ఓటు నమోదుకు పట్టభద్రులను ప్రోత్సహించాలన్నారు.

జిల్లా క్రికెట్ టీమ్‌కు సత్యరామ్‌పాల్



మామిడికుదురు: ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ జిల్లా క్రికెట్ టీమ్‌కు మామిడికుదురుకు చెందిన మట్టా సత్యరామ్‌పాల్ ఎంపికయ్యారు. నగరం స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న రామ్‌పాల్‌ను జిల్లా జట్టుకు ఎంపిక చేశారని క్రికెట్ కోచ్ మట్టా సత్తిబాబు ఆదివారం తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి అమలాపురంలో జరిగే స్టేట్ మీట్‌లో కోనసీమ జిల్లా జట్టు 12 జిల్లాల జట్లతో తలపడుతుందన్నారు. జిల్లా టీమ్‌కు ఎంపికైన రామ్‌పాల్‌ను స్కూల్ ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.